

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 07-12-2025 | సంపుటి - 26 | సంచిక -200 | రూ : 4 | పేజీలు: 8


## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు..
# రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం

- ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు
- ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే
- 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ఆర్థిక సదస్సు



2లో

## చరిత్రలో ఎన్నడూలేని రీతిలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ కవచ్':

2లో



## ప్రపంచం మందగమనం గురించి మాట్లాడుతున్న తరుణంలో
# మనం వృద్ధి దిశగా పయనిస్తున్నాం

- ప్రతి రంగంలో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్న ప్రధానమంత్రి
- భారతదేశ అభివృద్ధిలో నారీ శక్తి పాత్ర పెరిగిందన్న నరేంద్ర మోదీ
- భారతదేశం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని వెల్లడి

2లో



# వచ్చీ రాగానే.. ర్యాగింగ్!




2లో

- యూజీ, పీజీ వైద్య విద్య కోర్సులు ప్రారంభంకాగానే వెలుగుచూస్తున్న ఘటనలు
- హాస్టళ్ల వద్ద సీనియర్ల వేధింపులు
- చట్టాలున్నా.. కట్టడి చర్యలు అంతంతే

# సంక్షేమంలో నం. 1




- వచ్చే పదేళ్లలో అభివృద్ధి పథకాలతో దేశానికి నమూనాగా రాష్ట్రం
- మంచిరోజులొస్తాయని కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదం
- ఎస్ఎల్‌బీసీని పూర్తిచేస్తాం

2లో







మా నాన్న గారు
కీ॥శే॥ శ్రీ వెంకయ్య

మా తల్లి గారు
కీ॥శే॥ శ్రీమతి కమలమ్మ

నా భార్య
కీ॥శే॥ శ్రీమతి సుశీలమ్మ

కోల వారి "తులాభారం" ఆహ్వానము
శ్రీ శ్రీ కోల ఈశ్వరయ్య తండ్రి కీ॥శే॥ శ్రీ వెంకయ్య

వయస్సు 85 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా
రిటైర్డ్ ఉపాధ్యాయుడు (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సూరారం మరియు షాపూర్‌నగర్)
గారికి తులాబారం జరుపుటకు వేద పండితులు నిర్ణయించినారు కావున
తాతలు-నానమ్మలు, అమ్మమ్మలు, అన్నలు, అక్కలు, చెల్లెళ్లు చిన్నానలు, పెదనాన్నలు, పెద్దమ్మలు,
మేనమామలు, మేనత్తలు మరియు బంధుమిత్రులు అందరు సకాలమునకు విచ్చేసి మా దోతి తాత గారిని
ఆశీర్వదించి మా ఆథిద్యము స్వీకరించి మమల్ని ఆనందిపజేయ ప్రార్థన

తేది : 07-12-2025 ఆదివారము
మద్యాహ్నం 12 : 00 గం॥ ల నుండి
వేదిక :
వి.ఐ.పి. ఫంక్షన్ హాల్ నందు
సూరారం గ్రామం, ఖుత్బుల్లాపూర్ తాలూక, మేడ్చల్ జిల్లా.
నోట్ : ఎటువంటి బహుమతులు, పూలదండలు స్వీకరించబడవు
బీద విధ్యార్థులకు నోటుబుక్కు, పెన్నులు మరియు పెన్సిల్లు
స్వీకరించబడును




నార్త్ సిటీ హైస్కూల్, భారత్ డాక్యుమెంట్స్ రైటర్స్, భారత్ ఇంజనీర్స్


## మీరూ కాలేజీ కుర్రాళ్లు
# అవుతారా...

- విద్యార్థులతో కలిసి పాఠాలు వింటున్న సీనియర్ సిటిజన్లు
- క్రమం తప్పకుండా తరగతులకు హాజరు
- వివిధ కోర్సులను అభ్యసిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

2లో



## మా విజన్ డాక్యుమెంట్‌తో
# ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తాం

- తెలంగాణ భవిత కోసం గ్లోబల్ సమిట్
- 8న మధ్యాహ్నం ఒకటిన్నరకు ప్రారంభం
- 6 ఖండాలు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు రాక



2లో

# మా విజన్ డాక్యుమెంట్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తాం

హైదరాబాద్: తెలంగాణ భవిత కోసం పెట్టుబడులు ఆకర్షించేందుకు గ్లోబల్ సమిట్‌ను నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ సమిట్‌కు మొత్తం ఆరు ఖండాలకు చెందిన 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు (అమెరికా నుంచి 46) వస్తున్నారన్నారు. అధిక సంఖ్యలో దేశంలోని ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం ఒకటిన్నరకు సమిట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రారంభానికి సంబంధించిన వివరాలను శనివారం ప్రజాభవన్‌లో ఆయన మీడియాకు వివరించారు. ''భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించడం అత్యంత సంతోషదాయకం. డిసెంబరు 8న మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమై 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. ప్రారంభ సమావేశంలో 2.15 గంటలకి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడతారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని మంత్రివర్గం మొత్తం ఆలోచించి నీతిఆయోగ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సలహాలు, సూచనలతో విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం. ఈ డాక్యుమెంట్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తాం. సమిట్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆర్థికవేత్తలు, నిపుణులు ప్రసంగిస్తారు. కార్యక్రమంలో మొదటి రోజు నోబెల్ బహుమతి గ్రహీతలు అభిజిత్ బెనర్జీ, కైలాష్ సత్యార్థి..డైరెక్టర్ ఆఫ్ ట్రంప్‌మీడియా అండ్ టెక్నాలజీస్ గ్రూప్ నుంచి ఎరిక్ స్వేడర్,



మంత్రి శ్రీధర్‌బాబు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నేను కూడా ప్రసంగిస్తా. సమిట్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రసంగం చేసిన తర్వాత పలు రంగాలపై చర్చలుంటాయి. వేర్వేరుగా జరిగే ఈ చర్చల్లో సంబంధిత శాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శి, ఆయా రంగాల నిపుణులు పాల్గొంటారు. రెండో రోజైన 9వ తేదీ ఉదయం 9 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటలకు ముగుస్తాయి. ముగింపు కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొంటారో తరువాత తెలియజేస్తాం. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రధాన నేతలను స్వయంగా అధికారులు ఆహ్వానిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నేను, సహచర మంత్రులు అన్ని రాష్ట్రాలకు వెళ్లి ముఖ్యమంత్రులను ఆహ్వానించాం. తెలంగాణలో ఇంత పెద్ద సదస్సు జరుగుతోందని అన్ని రాష్ట్రాలకు సమాచారం ఇవ్వాలని అందరినీ పిలిచాం.



## సంక్షేమంలో నం.1

దేవరకొండ: సంక్షేమ పథకాలు అందించడంలో ఇప్పటికే రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా చేశామని.. రానున్న పదేళ్లలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ నమూనాగా నిలిచేలా అభివృద్ధి పథకాలు రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవ' సంబరాలను పురస్కరించుకుని నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో శనివారం రూ.20 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలకు రూ.11.33 కోట్ల చెక్కును అందజేశారు. శేరిపల్లిరోడ్డు వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. ''ఒకప్పుడు మంత్రులు వచ్చినా వారిని కలవకుండా అటు నుంచి అటే ఇంటికి పంపించిన కేసీఆర్.. ఇవాళ ఇద్దరు సర్పంచులు, నలుగురు వార్డు సభ్యులతో కలిసి మంచిరోజులు వస్తాయని చెబుతుండటం హాస్యాస్పదం. రూ.8 లక్షల కోట్లతో అప్పుల రాష్ట్రంగా మార్చినా ఇంకా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలకు అధికార దాహం తీరలేదా? కేసీఆర్ కుటుంబానికి కేటీఆరే గుదిబండ. ఎస్ఎల్‌బీసీ కోసం కాంగ్రెస్ నాయకులు అనేక పోరాటాలు చేశారు. ప్రమాదవశాత్తు 8 మంది చనిపోతే మామాఅల్లుడు ఆ ఆనందంతో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆరునూరైనా ఎస్ఎల్‌బీసీని మూడేళ్లలో పూర్తి చేస్తాం. ప్రజలు చెప్పులరిగేలా తిరిగినా పదేళ్లలో నాటి ప్రభుత్వం రేషన్‌కార్డు ఇవ్వలేదు. మేము ఒక్క దేవరకొండ నియోజకవర్గంలోనే 14 వేల కార్డులిచ్చాం. ప్రధాని మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్, ఇతర భాజపా పాలిత రాష్ట్రాల్లోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. ఆ రాష్ట్రాలన్నింటికీ సవాల్ విసిరేలా ఇక్కడ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. పదెకరాల్లో 150 గదులతో ఫాంహౌస్‌లు, ఇతర నిర్మాణాలు కట్టుకున్న కేసీఆర్ పేదలకు మాత్రం ఎక్కడా రెండు పడక గదుల ఇల్లు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో 4,50,000 ఇళ్లను నిర్మిస్తున్నాం. చెంచులు, గిరిజనులున్న ప్రాంతంలో అదనంగా 25 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నాం.

**దేవరకొండపై వరాల జల్లు**

దేవరకొండకు నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తాం. రూ.6 కోట్లతో స్థానిక ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తాం. దేవరకొండలో అన్ని మారుమూల తండాల నుంచి మండల కేంద్రాలకు సీసీ రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రానికి, అటు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేలా నాలుగు వరుసల రహదారులు నిర్మిస్తాం. పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే నెలాఖరులో ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో దేవరకొండలోనే సమీక్ష సమావేశం నిర్వహించి నిధులు మంజూరు చేస్తాం. అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగులో రాష్ట్రంలోని అతిపెద్దది గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం' అని సీఎం చెప్పారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీ అధ్యక్షుడు పొన్న కైలాష్ నేత, సీపీఐ నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచం మందగమనం గురించి మాట్లాడుతున్న తరుణంలో
## మనం వృద్ధి దిశగా పయనిస్తున్నాం

ప్రపంచం ఆర్థిక మందగమనం గురించి మాట్లాడుతున్న ప్రస్తుత తరుణంలో మన దేశం వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మహిళలు ప్రతి రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, భారతదేశ అభివృద్ధిలో నారీశక్తి పాత్ర గణనీయంగా పెరిగిందని, దీని ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. వలస పాలన నాటి మూలాలను పూర్తిగా వదిలించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారతదేశం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వృద్ధి ఇంజిన్‌గా భారత్ ఎదుగుతోందని మోదీ పేర్కొన్నారు. 2025లో ప్రభుత్వం సాధించిన మైలురాళ్లలో ప్రత్యక్ష పన్ను వ్యవస్థలో భారీ సంస్కరణలు ఒకటని ఆయన అన్నారు. రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదని గుర్తు చేశారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు... రేవంత్ రెడ్డి విహంగ వీక్షణం

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' జరగనుంది. ఈ సదస్సు ఏర్పాట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సును నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు తరలి వస్తారు. గ్లోబల్ సదస్సు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదని, తమ విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్ వివరాలను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 27 సెషన్లు ఉంటాయని, వివిధ రంగాల నిపుణులు, నిష్ణాతులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారని వెల్లడించారు. ముఖ్య అతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇలాంటి సదస్సు గతంలో ఎన్నడూ జరగలేదని భట్టివిక్రమార్క అన్నారు.

## డిసెంబర్ 10 నుంచి... భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం శనివారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు డిసెంబర్ 10న ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ చర్చలకు అమెరికా తరపున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విజ్జర్ పాల్గొంటున్నారు. భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అమెరికా ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత సెప్టెంబర్ 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ బృందం చర్చల కోసం అమెరికాకు వెళ్లింది. త్వరలో అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇటీవల తెలిపారు. భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాలను ప్రస్తావిస్తామని ఆయన వెల్లడించారు. టారిఫ్‌ల సమస్యను పరిష్కరించేందుకు ఒకసారి, పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు ఉంటాయని తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి వాణిజ్య చర్చలు పూర్తి చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

### చరిత్రలో ఎన్నడూలేని రీతిలో
## హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 'ఆపరేషన్ కవచ్'

హైదరాబాద్ నగరంలో 'ఆపరేషన్ కవచ్' పేరుతో నాకాబందీ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. కమిషనరేట్ చరిత్రలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు.

హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేసే దిశగా, రాత్రి 10 గంటల నుంచి 'ఆపరేషన్ కవచ్' పేరుతో నగరవ్యాప్తంగా విస్తృతమైన నాకాబందీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ చరిత్రలోనే మొదటిసారి దాదాపు 5,000 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో శాంతిభద్రతలు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్ విభాగాలతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు సంయుక్తంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రజా భద్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో నగర పౌరులందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## మీరూ కాలేజీ కుర్రాళ్లు అవుతారా...

హైదరాబాద్: కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు యువత వెళ్లి చదువుకోవడం సర్వసాధారణం. అందుకు భిన్నంగా హైదరాబాద్‌లోని పలు వర్సిటీలు, కళాశాలల్లో సీనియర్ సిటిజన్లు కనిపిస్తున్నారు. మనవడు, మనవరాళ్ల వయసున్న విద్యార్థులతో కలిసి తరగతి గదుల్లో కూర్చొని పాఠాలు వింటున్నారు. ఉద్యోగులు పదోన్నతుల కోసం దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీ చదవడం అనేది ఎన్నో ఏళ్లుగా ఉన్నదే. అందుకు భిన్నంగా కొద్ది సంవత్సరాల నుంచి కొందరు రెగ్యులర్ కోర్సుల్లో చేరి కాలేజీ కుర్రాళ్లు మాదిరిగా పుస్తకాల బ్యాగ్ చేతులకు తగిలించుకొని కళాశాలలు, వర్సిటీల్లో చదువుకునే ట్రెండ్ పెరిగింది. కొందరు ఏదో ఒక లక్ష్యంతో చేరుతుండగా...మరికొందరు ఆనాటి పరిస్థితుల వల్ల డిగ్రీ, పీజీ చదవలేకపోయామని ప్రవేశాలు పొందుతున్నారు. కొందరైతే ప్రవేశ పరీక్షలను రాసి...ర్యాంకులు సాధించి... ప్రవేశాలు పొందుతుండటం గమనార్హం. ఈ సంవత్సరం నీట్‌లో తమిళనాడుకు చెందిన 60 సంవత్సరాలు దాటిన వారు ముగ్గురు అర్హత సాధించారు. దిల్లీ వర్సిటీలోనే కొందరు వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. 'రెండు మూడు సంవత్సరాల నుంచి ఏటా ఒకరిద్దరు సీనియర్ సిటిజన్లు డీఫార్మసీలో చేరుతున్నారు. పిల్లల కంటే వారే ఆసక్తిగా ప్రశ్నలు వేస్తున్నారు. వారు తమ అనుభవాలను, జీవితం నేర్పిన పాఠాలను మిగిలిన విద్యార్థులకు చెబుతున్నారు' అని మాసబ్‌ట్యాంకులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ చెప్పారు. 'సీనియర్ సిటిజన్లు ఎంతో ఉత్సుకతతో సబ్జెక్టు నేర్చుకోవాలని భావించి క్రమం తప్పకుండా నిత్యం తరగతులకు హాజరవుతారు' అని ఓయూ లా ఆచార్యుడు, ఇటీవలే కొచ్చిలోని న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఆచార్య జీబీ రెడ్డి తెలిపారు.

**ఎన్నో మార్గాలు...**

దాదాపు అన్ని కోర్సులకు కనీస వయసు పరిమితి ఉంది తప్ప గరిష్ఠ పరిమితి లేదు. అందువల్ల ఎప్పుడైనా చదువుకోవచ్చు. ఉన్నత విద్యామండలి తరఫున నిర్వహించే సీపీగెట్ ద్వారా అనేక కోర్సులను ఏ డిగ్రీ చదివిన వారైనా పూర్తి చేయవచ్చు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్‌పీటీఈఎల్ స్వయం ప్లాట్‌ఫారమ్ ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకునే...పరీక్షించుకునే పలు సర్టిఫికెట్ కోర్సులను పూర్తి చేయవచ్చు. వాటిని ఐఐటీలు,

## వచ్చీ రాగానే.. ర్యాగింగ్!

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థిని గోడకుర్చీ వేయాలని నలుగురు సీనియర్లు వేధించారు. బాధితుడి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి రాగా.. నలుగురు విద్యార్థులనూ కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలోని ఒక ప్రైవేటు కళాశాలలో 8 మంది సీనియర్లు కలిసి ఒక జూనియర్‌ను ర్యాగింగ్ చేశారు. బాధితుడి తల్లి ఫిర్యాదు చేయడంతో ర్యాగింగ్ నిరోధక చట్టం కింద 8 మందిపై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలోనూ కొన్ని నెలల క్రితం నాలుగో సంవత్సరం చదివే విద్యార్థిని ఇద్దరు సీనియర్లు ర్యాగింగ్ చేశారు. అంతకుముందు ఖమ్మంలో ఒక జూనియర్ జుట్టు కత్తిరించిన ఘటన కలకలం సృష్టించింది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మళ్లీ ర్యాగింగ్ రాజుకుంటోంది. సీనియర్ల వేధింపులతో జూనియర్లు సతమతమవుతున్నారు. ఏటా యూజీ, పీజీ వైద్య విద్య కోర్సులు ప్రారంభం కాగానే ర్యాగింగ్ ఉదంతాలు ఎక్కువగా బయటపడుతున్నాయి. కళాశాలల్లో కాకుండా హాస్టళ్ల వద్ద జూనియర్లను కలుస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. వేధింపులకు పాల్పడిన వారిని కళాశాల నుంచి సస్పెండ్ చేసేలా, పోలీసు కేసు నమోదు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల వరకు జరిమానా విధించేలా ర్యాగింగ్ నిరోధక చట్టం ఉన్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. యాజమాన్యాలు కళాశాలల్లో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయడం, విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులతో ప్రమాణపత్రంపై సంతకాలు తీసుకోవడంతోనే సరిపెడుతున్నాయి. రాష్ట్రంలో వరుస ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎలాంటి ఉత్తర్వులు కళాశాలలకు రాకపోవడం గమనార్హం.

**చికిత్స కన్నా నివారణే మేలు**

ఎన్ఐటీ, ఐఐటీల్లో ర్యాగింగ్ కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఐఐటీ ముంబయిలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ ఉంటుంది. తరగతులు మొదలైన నెలరోజుల వరకు జూనియర్లతో సీనియర్లు మాట్లాడకూడదనే నిబంధన ఉంది. ఆ తర్వాత విద్యార్థులంతా స్నేహపూర్వకంగా కలిసే కార్యక్రమం చేపడతారు. వైద్య కళాశాలల్లోనూ కొత్త విద్యార్థులొచ్చిన మొదటి మూడు నెలలపాటు ర్యాగింగ్ కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటే ఈ మహమ్మారిని తరిమేయొచ్చు. ముఖ్యంగా హాస్టళ్ల వద్ద వార్డెన్లు, సెక్యూరిటీ గార్డులతో ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. జూనియర్లు కొన్నిసార్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు చెప్పినా పెద్దగా దృష్టిసారించకపోవడంతో.. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వెబ్‌సైట్ ద్వారా నేరుగా తమకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించింది.

# సైనిక్‌పురి రోటరీ క్లబ్ లో ఘనంగా వార్షికోత్సవం



ప్రజాస్ఫూర్తి. కాప్రా : సైనిక్‌పూరి రోటరీ క్లబ్ వార్షిక కార్యక్రమం శనివారం సికింద్రాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సేవాస్ఫూర్తిని ప్రతిబింబించే ఈ వేడుకలో రోటరీ 3150 జిల్లా గవర్నర్ డాక్టర్ రామ్ ప్రసాద్ ప్రధాన అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు అసిస్టెంట్ గవర్నర్ దివాకర రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ వేణుగోపాల్, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి తదితర సభ్యులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు భాగంగా, ఆర్థికంగా వెనుకబడిన ముగ్గురు మహిళలకు కుట్టు యంత్రాలను రోటరీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా పవర్ వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రపంచ జూనియర్ కేటగిరీ చాంపియన్‌గా నిలిచిన మూడేమ్ వంశిని క్లబ్ తరపున ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది.సమాజ ఉప్లిఫ్ట్మెంట్ కోసం నిరంతరం సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సైనిక్‌పురి రోటరీ క్లబ్ ప్రాంతానికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా గవర్నర్ రామ్ ప్రసాద్ ఈ సందర్భంగా ప్రశంసించారు. రోటేరియన్ ప్రభాకర్ నందన ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమం జరిగింది.

# బెల్ట్ షాపులు రద్దు చేయాలి

*** జూలూరుపాడు మహిళల ఆందోళన**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జూలూరుపాడు మండలవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న బెల్ట్ షాపులను వెంటనే నియంత్రించాలని కోరుతూ స్థానిక మహిళలు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా మద్యం సరఫరా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ప్రభావవంతమైన చర్యలు తీసుకోకపోవడంతో బెల్ట్ షాపులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మండలవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్కే ఫరీనా, భోగ లక్ష్మి, మంజుల, కాసింబి, నూర్జ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు బిల్లు.. గుండె ఝల్లు..!?

*** లక్షల బిల్లు చూసి షాక్ అయిన వినియోగదారుడు**






ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతినెల వేలల్లో వచ్చే కరెంటు బిల్లు ఒక్కసారిగా లక్షల్లో రావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లోని అరుణ్ ఐస్‌క్రీమ్ షాపు నిర్వాహకుడు అశోక్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. శనివారం రాత్రి అందుకున్న తాజా బిల్లు రూ. 12,35,191/ గా ఉండటాన్ని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు.గత నెలలో రూ. 40,063/, అక్టోబర్‌లో రూ. *37,192/గా ఉన్న బిల్లు ఈ నెలలో అకస్మాత్తుగా లక్షల రూపాయలకు చేరడం గమనార్హం. “వెయ్యో, పది వేల రూపాయలు ఎక్కువగా వస్తే ఏదో అనుకోవచ్చు. ఇలా లక్షల్లో బిల్లు రావడం ఏమిటి?” అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం లేదా మీటర్/రీడింగ్‌లో సాంకేతిక లోపం వల్లే బిల్లు పెరిగి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అశోక్ సిద్ధమయ్యారు. “అంత మొత్తం చెల్లించాల్సి వస్తే వ్యాపారం మూసుకోవాల్సిన పరిస్థితి” అని వాపోయారు. అధికారులు స్పందించి మరోసారి బిల్లును పరిశీలించి సరిదిద్దాలని స్థానికులు కూడా కోరుతున్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా 63వ హోంగార్డ్స్ రైజింగ్ డే వేడుకలు







ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పోలీసు శాఖలో హోంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు.ముందుగా ఎస్పీ శాంతి కపోతాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జిల్లా పోలీస్ శాఖలో భాగంగా పనిచేస్తున్న హోంగార్డ్స్ ఆఫీసర్స్ నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు.సుందరంగా అలంకరించిన వాహనంలో పరేడ్ నందు పాల్గొన్న 06 హోమ్ గార్డ్స్ ప్లాటూన్స్ ను ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఒక భాగమై,పోలీసులతోసమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమని అన్నారు. వరదలు సంభవించినపుడు,ఎన్నికల సమయంలో రోజువారీ విధులలో హోంగార్డ్ ఆఫీసర్స్ అంకితభావంతో సేవలందిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్రాలలో కూడా ఎన్నికల బందోబస్తులో అప్పగించిన భాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్నారని వారి సేవలను కొనియాడారు.నిత్యం క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని వారికి సూచించారు.హోంగార్డ్స్ ఆఫీసర్స్ సంక్షేమానికి అన్నివేళలా ముందుంటామని తెలిపారు.పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. త్వరలో పదవీ విరమణ పొందుతున్న 02 మంది హోంగార్డ్స్ ఆఫీసర్లకు, హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడల్లో బహుమతులు సాధించిన వారికి ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు.అదేవిధంగా విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది. హోమ్గార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి వారితో కలిసి ఎస్పీ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా ఏర్పాటు చేసిన ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఆర్ఐ నరసింహారావు,ఇతర అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అక్కడ ఏర్పాటు అల్పాహార విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,2 టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్,1టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్,ఆర్ఐలు హోమ్ గార్డ్స్ ఆర్ఐ నరసింహారావు,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,జిల్లా హోమ్ గార్డ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజలందరూ నిర్భయంగా

# తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

*** డిఎస్పీ రెహమాన్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిఎస్పీ రెహమాన్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చుంచుపల్లి రామాలయం నుండి బైపాస్ రోడ్డు వరకు కొత్తగూడెం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. డిఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ నకు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మద్యం,నగదు , ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో సుమారుగా అధికారులు,సిబ్బంది కలిసి మొత్తం 100 మంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సబ్ డివిజన్ అధికారులంతా పాల్గొన్నారు.

# బీదలకు తోడ్పాటు నూతన వస్త్రాల బహుకరణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ క్రిస్మస్ సీజన్ సందర్భంగా కొత్తగూడెం మాజీ మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాల్ తన వంతు సేవగా బీదవారిని స్వయంగా గుర్తించి నూతన వస్త్రాలను బహుకరిస్తున్నారు. ప్రతిరోజూ పలు ప్రాంతాల్లో పేద కుటుంబాలను చేరుకుని తోడ్పాటు అందిస్తున్నారు.నేడు పాత కొత్తగూడెం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒబద్యా-శ్రీదేవి దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలను చక్కగా చదివించాలని, విద్యే జీవితాలను మలుపుతిప్పే శక్తి అని వివరించారు. “నేనూ ఇదే సామాజిక వర్గానికి చెందినవాడినే” అని పేర్కొన్నారు.డాక్టర్ ప్రభుదయాల్ వెంట రమేష్ (స్కూల్ అసిస్టెంట్) ఉన్నారు. పేదల పట్ల ఆయన చూపుతున్న చొరవకు స్థానికులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# బీసీల మనోభావాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదు

*** బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు , న్యాయవాది సిందం శ్రీకాంత్ యాదవ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బీసీలను అవమానిస్తూ, వారి మనోభావాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదని బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు , న్యాయవాది సిందం శ్రీకాంత్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా 42% రిజర్వేషన్లు బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు , కాంట్రాక్టులలో కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో అమలులో ఉన్న 25% బదులుగా కేవలం 17% మాత్రమే రిజర్వేషన్ కల్పించడం, బీసీలపై కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా అభిశంసించారు. ఈ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్రవ్యాప్తంగా బీసీ యువతలో తీవ్ర నిరాశ, ఆవేదన నెలకొంటోందని ఆయన అన్నారు. ప్రజల భావోద్వేగాలను కించపరుస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రకటనలు, వ్యవహారశైలి వల్ల తీవ్రమైన అసంతృప్తి వ్యాపించిందన్నారు. నల్గొండ జిల్లాలోని ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు దీనికి స్పష్టమైన ఉదాహరణలని ఆయన అన్నారు.ప్రజల మనోభావాలను తక్కువ చేసి చూసిన ప్రతి నాయకునికి, బీసీల న్యాయం కోసం పోరాడుతున్న ప్రతి వ్యక్తి సమర్థించే విధంగా, ప్రజా క్షేత్రంలో తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

# పిట్లం గ్రామ అభివృద్ధికై మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించండి

**: నవాబ్ సుదర్శన్ గౌడ్**



(ప్రజాస్ఫూర్తి, నల్గొండ) : ఒకసారి అవకాశం ఇవ్వండి పిట్లం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పిట్లం సర్పంచ్ అభ్యర్థి నవాబ్ సుదర్శన్ గౌడ్ అన్నారు. బ్యాలెట్ పేపర్ లోని 4వ నెంబర్ లోని ఫుడ్ బాల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పిట్లం గ్రామంలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తానని.. నిరుద్యోగ ఆడపడుచులకు కుట్టు మిషన్లతో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, ఎవరైనా నిరుపేద చనిపోతే తక్షణ ఆర్థిక సాయం, నిరుపేద ఆడపడుచులకు పెళ్లి కానుక, స్కూలు పిల్లలకు నోటు పుస్తకాలు, నిరుద్యోగులకు ఉచిత స్టడీ మెటీరియల్ మరియు ఆన్లైన్ కోచింగ్, పరీక్షల సమయంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తాని సుదర్శన్ గౌడ్ హామీ ఇచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామస్తుల క్షేమం కోసం అన్ని ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటు చేస్తన్నన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి పిట్లం సర్పంచ్ గా అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# చిన్నోడు ఆఫాన్ జైదీ హరిత దీక్షకు హీరో శివరాజ్ కుమార్ అభినందన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శ్రీ ప్రవల్లిక ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రారంభమైన “ప్రజల మనిషి గుమ్మడి నరసయ్య” చిత్ర ప్రారంభోత్సవానికి కన్నడ చిత్రసీమ సూపర్‌స్టార్ డా. శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకుడు చిరంజీవి మహమ్మద్ ఆఫాన్ జైదీ ప్రముఖులకు పచ్చని మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. “చెట్లను కాపాడకపోతే రేపు మనమే చెట్లను వీపుపై మోసుకోవాల్సి వస్తుంది” అన్న వినూత్న నినాదంతో నిర్వహించిన ఆయన ప్రచారాన్ని శివరాజ్ కుమార్‌తో పాటు ఇతర ప్రముఖులు అభినందించారు.ఈ కార్యక్రమంలో నిర్మాత సురేష్ రెడ్డి, దర్శకులు పరమేశ్వర హివ్రాల్, ప్రముఖ రాజకీయ నాయకురాలు కల్వకుంట్ల కవిత పలువురు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్న కె.ఎన్. రాజశేఖర్ ప్రేరణతో ప్రకృతి హరిత దీక్షను స్వీకరించిన ఆఫాన్ జైదీ (ముస్తాఫా - పర్వీన్ దంపతుల మనువడు, అమన్, రేష్మల కుమారుడు) పర్యావరణ పరిరక్షణకు మరో అడుగు వేశారు.

## కొంపల్లిలో సఖి" ఎగ్జిబిషన్ ప్రారంభం



జీడిమెట్ల,(ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీ కన్వెన్షన్ నందు రెండు రోజుల పాటు నిర్వహించనున్న సఖి ఎగ్జిబిషన్ ను శనివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులను అర్థం చేసుకుంటూ వ్యాపారా భివృద్ధిలో నూతన ఉత్పత్తులను రూపొందించడంలో ఎగ్జిబిషన్ లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలి

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జీడిమెట్ల,( ప్రజాస్ఫూర్తి ) : అయ్యప్ప స్వామి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి గజానన అపార్ట్మెంట్స్ నందు నిర్వహించిన అయ్యప్ప మహపడిపూజ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంద్రియాలను నిగ్రహించుకొని అయ్యప్ప స్వాములు మండల రోజుల పాటు నిర్వహించే కఠిన దీక్షలలో అయ్యప్ప దీక్ష ఒకటని అన్నారు. అయ్యప్ప స్వామి కృపతో ప్రతి భక్తుని జీవితంలో వెలుగు నిండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ చింతల దేవేందర్ యాదవ్, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో రోల్ మోడల్ గా గ్లోబల్ సమ్మిట్

* **అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ**
* **రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించే . ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ సమ్మిట్ కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేషగుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు 2037 విజన్, 2047 విజన్ ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్ లో వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు శనివారం సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని, గడువులోగా పూర్తిస్థాయి ఏర్పాట్లకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ ప్రగతి దేశంలో ఉన్న రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఇందిరమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. .తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్ పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై ఎప్పటికప్పుడు వచ్చే అతిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశీస్తున్నారని చెప్పారు.



## సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

* **కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలు కానీ లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మెదక్ లో జరగబోయే సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలు కానీ లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్యలు అన్నారు. శనివారం సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయం దగ్గర మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల ఏడవ తారీఖు నుండి 9వ తారీఖు వరకు మెదక్ పట్టణంలో 5 రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని ఏడవ తారీఖు మధ్యాహ్నం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభలో సిఐటియు కేంద్ర రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు గడిచిన కాలంలో రాష్ట్రంలో జరిగిన కార్మిక ఉద్యమాలు.పోరాటాల ను సమీక్షించుకుని రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాడుతామని జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతికి వ్యతిరేకంగా ఎస్ఐ పిఎఫ్ కనీస వేతనాలు అమలు చేయాలని వలస కార్మిక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ ఆటో భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్నారు. 60 సంవత్సరాల దాటిన అసంఘటిత రంగ కార్మికులకు కనీసం పదివేల పెన్షన్. కోసం పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల నాయకులు మధు కనకయ్య యాదవ రెడ్డి. సురేష్ తదితరులు పాల్గొన్నారు

## యూరియా కొరత రాకుండా ఏర్పాట్లు చేయాలి: హరీశ్‌రావు



హైదరాబాద్: రైతులకు యూరియా కొరత రాకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని, సీఎం రైతు వ్యతిరేక విధానాలతో రైతన్నలు నరకం చూస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పర్యటించిన నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం ధర్మారావుపేట గ్రామంలో యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారంటూ ఒక ఫొటోను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రైతులకు యూరియా సరఫరా చేయడం చేతగాని రేవంత్‌రెడ్డి, నర్సంపేట పర్యటనలో ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. గ్లోబల్ సమిట్, విజన్ 2047 అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న రేవంత్‌రెడ్డి..ముందు రైతులకు యూరియా సరఫరా చేయడంపై దృష్టి సారించండి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

* **అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తూ ప్రకటన విడుదల చేశారు.

## ప్రతి కాలనీ, బస్తీలలో ఉచిత మెడికల్ క్యాంప్ లు నిర్వహించాలి

* **నేచురోపతి క్లినిక్ డాక్టర్ ఉషారాణి లేళ్ళ**







జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రతికాలనీ, బస్తీలలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంప్ లు నిర్వహించాలని ఉషారాణి మెమోరియల్, నేచురోపతి క్లినిక్ డాక్టర్ ఉషారాణి లేళ్ళ కోరారు. చింతల్ లోని శ్రీసాయి కాలనీ శ్రీ హనుమాన్, పోచమ్మ టెంపుల్స్ వద్ద... శ్రీ హనుమాన్ అన్నప్రసాద ట్రస్ట్ చైర్మెన్ కన్నెకంటి లక్ష్మణ్, ప్రసిడెంట్ కళ్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మెడికొవర్ హస్పిటల్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో సుమారు 80మందికి హెల్త్ చెకప్, బిపి, షుగర్ టెస్ట్ లు చేసారు. ...వారి సమస్యలకు అనుగునంగా తగు ట్రీట్మెంట్లు ఆకుపంక్చర్, యోగా ముద్రలతో పాటు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా డా. ఉషారాణి మాట్లాడుతూ...శ్రీ సాయి కాలనీలో ప్రతినెల మొదటి శనివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఈ కాలనిలో ఇది రెండో క్యాంప్ అని, పరిసర ప్రాంత ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. తమకు సహకరిస్తున్న కాలనీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శ్రీ హనుమాన్ అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చిరంజీవి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కన్నెకంటి శైలజ, లక్ష్మి శ్రీనివాస్, వాని, శిరిషా అర్చన, రాజేశ్వరీ, సంధ్య, మెడికొవర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వారంలో పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభిస్తాం

* **కాళోజీ ఆరోగ్య వర్సిటీ వీసీ రమేశ్‌రెడ్డి**



ఎంజీఎం ఆసుపత్రి : వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ వారంలో ప్రారంభిస్తామని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి తెలిపారు. నూతనంగా వీసీ బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం వర్సిటీలో రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జునరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. 'పాత పీజీ సీట్లతోపాటు కొత్తగా మంజూరైన 420 పీజీ సీట్లను భర్తీ చేస్తాం. ఏయే కళాశాలలో ఏయే పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయో స్పష్టంగా వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులకు తెలియజేస్తాం. గతంలో కౌన్సెలింగ్‌లో ఎదురైన సమస్యలు ఈసారి రానివ్వం. సీట్ మ్యాట్రిక్స్ పద్ధతిలో కౌన్సెలింగ్ చేపడతాం. పరీక్షపత్రాల తయారీలో నిర్లక్ష్యం వహించిన ప్రొఫెసర్లను బ్లాక్‌లిస్టులో పెడతాం. విద్యార్థుల జవాబుపత్రాల పునఃమూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోంది. పారదర్శక పరిపాలనతో వర్సిటీ ప్రతిష్ఠను పెంపొందిస్తాం' అని ఆయన వెల్లడించారు.

## తమిళనాడులో రోడ్డు ప్రమాదం..
# నలుగురు అయ్యప్ప భక్తులు మృతి



చెన్నై (ప్యారిస్): తమిళనాడులోని రామేశ్వరంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన అయ్యప్ప భక్తులు కారు ఆపి నిద్రిస్తుండగా డీఎంకే నేతకు చెందిన మరో కారు వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు అయ్యప్ప భక్తులు, డీఎంకే కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో అయ్యప్ప భక్తుడు మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వీరంతా శబరిమలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ముగ్గురిని ఏపీలోని విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస వాసులుగా గుర్తించారు. మరొకరిని గజపతినగరం మండలం మరుపల్లివాసిగా గుర్తించారు.

* **దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత**

రోడ్డు ప్రమాదంలో విజయనగరం వాసుల మృతి పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను త్వరితగతిన కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయ పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం జరగడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## పోలీస్‌శాఖకు వెన్నెముకలా హోంగార్డులు

హైదరాబాద్: తెలంగాణ పోలీస్‌శాఖకు హోంగార్డులు వెన్నెముకలా నిలుస్తున్నారని..పెద్దగా ప్రతిఫలం ఆశించకుండా సేవలందిస్తున్నారని డీజీపీ బి.శివధర్‌రెడ్డి ప్రశంసించారు. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న అంశాలతో త్వరలోనే వారు శుభవార్త వింటారని పేర్కొన్నారు. హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని 30 ఏళ్లకుపైగా సేవలందిస్తున్న హోంగార్డులతో డీజీపీ తన కార్యాలయంలో శనివారం కేక్ కట్ చేయించారు. హోంగార్డుల సేవలకు సముచిత గౌరవం దక్కాలనే ఉద్దేశంతో అన్ని పోలీస్ యూనిట్లలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సంపద కొందరి చేతుల్లోనే ఉంటే.. 'ఇండిగో' తరహా పరిస్థితులే: కేటీఆర్

హైదరాబాద్: అధికారం ఒకరిద్దరి చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఇప్పుడు దేశంలోని విమానాశ్రయాల్లో నెలకొన్న పరిస్థితే ఉత్పన్నమవుతుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పైలట్లను దోపిడీ చేయొద్దని కేంద్రం గతేడాది చెప్పినా.. విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోలేదని, అందుకే ఇప్పుడు ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. ఇండిగో వెనక్కి తగ్గలేదుగానీ, కేంద్రం తన ఆదేశాలను ఉపసంహరించుకుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలట్ల విషయంలో ఏడాది క్రితమే డీజీసీఏ షరతులు



విధించిందని అన్నారు. " దేశంలో విమానాలన్నీ టాటా, ఇండిగో చేతుల్లోనే ఉన్నాయి. ఐదు రోజుల తర్వాత కేంద్రమే వెనక్కి తగ్గింది. తాను ఇచ్చిన ఆదేశాలను తానే వెనక్కి తీసుకుంది. సంపద మొత్తం కొందరి చేతుల్లోనే ఉంటే ఇలాంటి పరిస్థితులే వస్తాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండాలి. అది కూడా నాణ్యతతో ఉండాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.




## విత్తన చట్టం రైతులకు ఆమోదయోగ్యంగా లేదు

**: రైతు కమిషన్**

కేంద్రం తెస్తున్న విత్తన చట్టం రైతులకు ఆమోదయోగ్యంగా లేదని, మల్టీనేషనల్ విత్తన కంపెనీలు కోసమే అన్నట్లుగా ఉందని రైతు కమిషన్‌చైర్మన్‌కోదండ రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే విత్తనోత్పత్తి కి తెలంగాణ కేంద్రంగా ఉందని, ప్రపంచదేశాలకు తెలంగాణ విత్తనం ఎగుమతి అవుతుంది కేంద్రం తెస్తున్న విత్తన చట్టంలో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. తెలంగాణలో విత్తన కంపెనీల తీరు కూడా బాగాలేదని సీడ్స్ కంపెనీలు కూడా వారి లోపాలను సవరించుకోవాలన్నారు. శనివారం రైతు కమిషన్‌కార్యాలయంలో సభ్యులు కెవిఎన్‌రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి కలిసి కేంద్ర విడుదల చేసిన విత్తన చట్టంపై ముసాయిదాపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుకు నష్టం లేకుండా చట్టం ఉండాలని, దానికి కంపెనీలు కూడా చెబుతున్నాయని ఆర్గనైజర్ల వ్యవస్థతో రైతులకు కంపెనీలకు కూడా నష్టమేనని నిర్ధారణకు వచ్చారు. కానీ లక్షలాది మంది రైతుల వద్దకు నేరుగా కంపెనీ వెళ్లలేని పరిస్థితుల్లో ఈ ఆర్గనైజర్లు వచ్చారని తెలిపారు. నకిలీ విత్తనం విషయంలో రైతులకు నష్ట పరిహారం అందించాలి. కేంద్రం తెస్తున్న చట్టంలో క్లారిటీ లేదు. రైతులు కోర్టులను ఆశ్రయించాలంటే వారికి ఎప్పుడు న్యాయం జరుగుతుందో తెలియని విధంగా ఉందన్నారు. విత్తన కంపెనీలకు అనుమతులు ఇవ్వడం, ధర నిర్ధారణ అంత రాష్ట్ర పరిధిలో ఉండాలని కేంద్రాన్ని కోరారు. ఈనెల 11న వరకు కేంద్రం విత్తన చట్టంపై అభ్యంతరాలకు గడువు ఇచ్చిందని ఇప్పటివరకు రైతులు తమ అభిప్రాయాలు తెలపాలని సూచించారు.

## తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్

అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించే లక్ష్యంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అత్యుత్తమ స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కు సంబంధించి భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం సాయంత్రం పరిశీలించారు. సదస్సు నిర్వహిస్తున్న మీర్‌ఖాన్‌పేట్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. తర్వాత వేదిక ప్రాంగణమంతా



కలియతిరిగి ఏర్పాట్లను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ దేశాల నుంచి ప్రతినిధులు, దిగ్గజ కంపెనీల ప్రతినిధులు సదస్సులో పాల్గొంటున్న నేపథ్యంలో ప్రతి అంశంలోనూ అత్యంత జాగ్రత్త వహించాలని చెప్పారు. సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికత ఉట్టిపడే విధంగా ఆయా అంశాలపై ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్లను వీక్షించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున వారికి స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు సూచించారు. ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భోజన వసతి వంటి అంశాలపై సూచనలు చేశారు. ప్రాంగణంలో భద్రతా పరమైన ఏర్పాట్లతో పాటు ఫైర్ సేఫ్టీ అంశాలపైనా ఆరా తీశారు. ఈ పరిశీలనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఉన్నారు.

### ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు

## మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కీలక రిక్వెస్ట్

రాష్ట్రంలో 202425 సంవత్సరానికి సంబంధించిన పారా బాయిల్డ్ రబీ కోట అదనపు కేటాయింపులు చేసేందుకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సానుకూలంగా స్పందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంస్థ ఎండీ ఆశుతోష్ అగ్నిహోత్రికి విజ్ఞప్తి చేశారు. శనివారం సచివాలయంలోని సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రెండు పంట సీజన్ల కోసం కేంద్ర ప్రభుత్వం 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని రబీ నుంచి ఇప్పటి వరకు 17.06 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్, 0.87 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇంకా 2.34 లక్షల మెట్రిక్ టన్నులు పార్ బాయిల్డ్, 14.26 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఈ రబీ సీజన్ లో పారా బాయిల్డ్ రైస్‌కు అనుకూలంగా ఉంటుందని రబీ కింద అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ రైస్ కేటాయింపు చేయాలని కోరారు. పారా



బాయిల్డ్ రైస్ తరలింపు కోసం అదనపు రేక్‌ల అవసరం ఉంటాయని ప్రస్తుత సంవత్సరం రేక్ తరలింపు గత సంవత్సరంతో పోలిస్తే 13.5 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉందని వివరించారు. ఎఫ్‌సీఐ గోడౌన్లలో పారాబాయిల్డ్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయని, దీంతో సీఎంఆర్ డెలివరీలు ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎఫ్‌సీఐ డిపోల నుంచి పారాబాయిల్డ్ బియ్యం తరలింపును వేగవంతం చేయడానికి అదనపు రేక్‌లను కేటాయించాలన్నారు. ఖరీఫ్ కోసం సీఎంఆర్‌బియ్యం సరఫరా వ్యవధి పొడిగించాలని, డెలివరీ సమయం గత నెల 12న ముగిసిందని వివిధ కారణాలతో ఇప్పటికీ 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉందని గడువు మరో 60 రోజుల పొడిగించాలని కోరారు. తెలంగాణలో నిల్వ సామర్థ్యం పెంపుదల చేయాలని ప్రస్తుతం నిల్వ సామర్థ్యం 65 లక్షల మెట్రిక్ టన్నులు ఉందని వివిధ ప్రభుత్వ సంస్థలు పూర్తిగా వీటిని ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. ఎఫ్‌సీఐ అద్దెకు తీసుకోగల గోడౌన్ల రకంపై పరిమితుల కారణంగా నిల్వ కొరతను ఎదుర్కొంటుందన్నారు. నిల్వ పరిమితులతో సకాలంలో సీఎంఆర్ డెలివరీలు చేయలేకపోతున్నామని సంబంధిత నిల్వ పథకం కింద ఎఫ్‌సీఐ ద్వారా అదనంగా 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని మంజూరు చేయాలన్నారు. వచ్చే ఫిబ్రవరి నాటికి ప్రభుత్వం 18 లక్షల టన్నులు తీసుకోవాల్సి ఉన్నందున, ఖరీఫ్ కోసం 10 నుంచి 12 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వాలని కోరారు.



### ఐదు దశాబ్దాల తర్వాత

## రామగుండం థర్మల్ స్టేషన్ మూసివేత

ఐదు దశాబ్దాలుగా తెలంగాణకు సేవలందించిన రామగుండం థర్మల్ స్టేషన్ మూసివేయబడింది. రాష్ట్రంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండం థర్మల్ స్టేషన్ ను అధికారులు మూసివేశారు. 1971 అక్టోబర్‌లో USAID సహకారంతో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా రామగుండం థర్మల్ స్టేషన్ చరిత్రలో నిలిచిపోయింది. ఈ ప్లాంట్ మొత్తం 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన ఈ ప్లాంట్ జీవితకాలం ముగిసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు ప్రభావిత జిల్లాల్లోని వ్యవసాయ పంపు సెట్లకు ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా సేవలు అందించిన ఈ థర్మల్ స్టేషన్ తాజాగా మూతపడటంతో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

### గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ పోలీస్..

## ఫోరెన్సిక్స్ యుగానికి దారితీసే విప్లవాత్మక రోడ్‌మ్యాప్

రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలో కీలకం కానున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047లో రాష్ట్ర పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రదర్శించేందుకు సన్నాహాలు చేపట్టారు. సమ్మిట్‌లో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ యాక్ట్‌ను ప్రతిపాదించేందుకు డీజీపీ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రపంచ ఫోరెన్సిక్స్ కాన్ఫరెన్స్ ప్రతిపాదనకు పోలీస్ శాఖ సన్నద్ధం అవుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. ఈ సమ్మిట్‌లో రాష్ట్ర పోలీసుల సాంకేతిక సామర్థ్యాలు, వినూత్న కార్యక్రమాలు, ప్రజల కేంద్రంగా పనిచేసే వ్యవస్థలను సమర్థవంతంగా ప్రదర్శించడం ద్వారా భద్రత, రక్షణపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పటిష్టం చేయాలని అధికారులకు డీజీపీ స్పష్టం చేశారు.

*** సైబర్, ఫోరెన్సిక్ సామర్థ్యాలలో అంతర్జాతీయ స్థాయికి రోడ్ మ్యాప్**

సైబర్, ఫోరెన్సిక్ విభాగాలలో రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయికి తీసు



కెళ్లడానికి రూపొందించిన రోడ్‌మ్యాప్‌ను వివరించనున్నారు. ఆర్థిక సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం పూర్తిగా ఏఐఆధారిత 'డయల్ 1930' వ్యవస్థను అమలు చేయడం, రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ ఫోరెన్సిక్ హబ్‌లను విస్తరించడం ముఖ్య లక్ష్యాలుగా పేర్కొన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, టెలికాం ఆపరేటర్లను అనుసంధానిస్తూ 'సైబర్ కమాండ్ అండ్ ఫ్యూజన్ గ్రిడ్' ప్లాట్‌ఫారమ్‌ను సృష్టించడం, పిల్లల రక్షణ యూనిట్‌ను, రియల్ టైమ్‌లో మోసాలను గుర్తించే అటానమస్ ఫ్రాడ్ హంటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం వంటివి ప్రతిపాదించారు. వీటితో తెలంగాణలో ప్రపంచ ఫోరెన్సిక్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రవేశ పెట్టేందుకు సన్నాహాలు చేపట్టారు.

## మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్: గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు" అని భట్టి విక్రమార్క తెలిపారు.



## కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి: ఈటల

కమలాపూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా సర్పంచులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కమలాపూర్, భీంపల్లి, కన్నూరు, గుండెడు గ్రామాల్లో భాజపా బలపరిచిన స్థానిక ఎన్నికల అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. "గ్రామాల్లో కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి జరుగుతోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా కేంద్రం నిధులతోనే నిర్మిస్తున్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడానికి కూడా రాష్ట్రం దగ్గర డబ్బులు లేవు. ఎన్నికల్లో కొంతమంది డబ్బులిచ్చి ఓట్లను కొంటాం అంటున్నారట. మనుషుల ఆత్మగౌరవానికి వెలకట్టలేరు. ఈటల పేదల పక్షాన కొట్లాడే బిడ్డ. అధికారం ఉన్నా లేకున్నా మీకు కావాల్సినవి అందించే భాధ్యత నాది" అని ఈటల రాజేందర్ అన్నారు.

# పూరీ ఆలయం పేరిట 60 వేలకుపైగా ఎకరాలు: ఒడిశా మంత్రి



దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒడిశాలోని పూరీ శ్రీక్షేత్రం ఒకటి. జగన్నాథ ఆలయానికి రాష్ట్రంలో 60 వేల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ వెల్లడించారు. మరో ఆరు రాష్ట్రాల్లో 395 ఎకరాలు ఉన్నట్లు అసెంబ్లీలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 12వ శతాబ్దం నాటి ఈ ఆలయం.. 'శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1956' ప్రకారం న్యాయశాఖ నిర్వహణలో ఉంది. ఒడిశా (Odisha News)లోని 24 జిల్లాల్లో మొత్తం 60,426.94 ఎకరాల భూమి పూరీ జగన్నాథుడి పేరిట ఉంది. మరో 395.25 ఎకరాలు.. పశ్చిమ బెంగాల్ (322.93), మహారాష్ట్ర (28.21), మధ్యప్రదేశ్ (25.11), ఆంధ్రప్రదేశ్ (17.02), ఛత్తీస్‌గఢ్ (1.70), బిహార్ (0.27)లలో ఉన్నాయి. 38,061.79 ఎకరాలకు సంబంధించిన రివైజ్డ్ రికార్డులు ప్రస్తుతం పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయ అధికారుల వద్ద ఉన్నాయని మంత్రి తెలిపారు. దేవాలయ భూమిని ఆక్రమించిన ఘటనలు కూడా ఉన్నాయని మంత్రి పృథ్వీరాజ్ తెలిపారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 169.86 ఎకరాల భూమి ఆక్రమణకు గురికాగా.. విడిపించేందుకు శ్రీ జగన్నాథ ఆలయ చట్టం కింద మొత్తం 974 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆలయ ఆస్తులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అసెంబ్లీకి హామీ ఇచ్చారు.






## విదేశీ ఆటగాళ్లను ఆకట్టుకున్న జల్లికట్టు

మదురై: తమిళనాడులోని మదురైలో ఇంటర్నేషనల్ యూత్ వరల్డ్ హాకీ టోర్నమెంట్ జరుగుతోంది. ఇందులో పాల్గొనేందుకు చైనా, బంగ్లాదేశ్, ఒమన్, ఆస్ట్రియా సహా 8 దేశాల క్రీడాకారులు వచ్చారు. తమిళ సంప్రదాయ క్రీడ గురించి వారికి తెలియజేసేందుకు అలంగనల్లూర్‌కు సమీపంలోని కీజకరై గ్రామంలోని ఓ స్టేడియంలో ప్రత్యేక జల్లికట్టుకు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలను చూసి విదేశీ ఆటగాళ్లు సంబరపడ్డారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 104 జల్లికట్టు ఎద్దులను, వాటిని పట్టుకోవడంలో ప్రావీణ్యం ఉన్న ఓ 50 మందిని రప్పించారు. రాష్ట్ర వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్లశాఖ మంత్రి పి.మూర్తి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు బహుమతులు అందజేశారు. తమిళ సంప్రదాయ దుస్తులు ధరించి ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా వీక్షించిన విదేశీ ఆటగాళ్లకు.. స్థానిక వంటకాల రుచి చూపించారు. మటన్ చుక్కా, ఖాదీ చోప్స్, చికెన్ రోస్ట్, మటన్ ఉప్పు కర్రీ, వంజీరం చేపలు, ఐరయ్ చేపల కూర, తదితర వంటకాలు వడ్డించారు.

## 3 కి.మీ మేర సాష్టాంగ ప్రణామాలు.. మొక్కు తీర్చుకున్న భాజపా ఎమ్మెల్యే



చక్కెర కర్మాగారం పునఃప్రారంభానికి సంబంధించి తన కోరిక నెరవేరడంతో ఓ భాజపా ఎమ్మెల్యే మూడు కిలోమీటర్ల మేర సాష్టాంగ ప్రణామాలు చేస్తూ స్థానిక ఆలయానికి చేరుకున్నారు. మహారాష్ట్ర లాతూర్ జిల్లాలోని కిల్లారి గ్రామంలో రైతుల ఆధ్వర్యంలోని ఓ చక్కెర కార్మాగారం అనేక ఏళ్లుగా మూతబడి ఉంది. యంత్రాలు అరిగిపోయి, మౌలిక సదుపాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో ఔసా నియోజకవర్గ ఎమ్మెల్యే అభిమన్యు పవార్ స్థానిక నీలకంఠేశ్వర ఆలయాన్ని సందర్శించారు. చక్కెర పరిశ్రమ మళ్లీ అందుబాటులోకి వస్తే.. సాష్టాంగ ప్రణామాలు చేస్తూ ఆలయానికి వస్తానని మొక్కుకున్నారు. ఇటీవల కర్మాగారం పునఃప్రారంభమైంది. చక్కెర ఉత్పత్తి మొదలైంది. దీంతో ఆయన మొక్కు తీర్చుకునేందుకు కర్మాగారం నుంచి ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర సాష్టాంగ ప్రణామాలు చేసుకుంటూ వచ్చారు. తొలి చక్కెర సంచిని నీలకంఠేశ్వరుడికి సమర్పించారు. అభిమన్యు పవార్ గతంలో నిరుపేదలైన 25 జంటలకు ఘనంగా సామూహిక వివాహాలు జరిపించారు. ఈ జంటలతో పాటే ఆయన కుమారుడి వివాహం కూడా చేయడం విశేషం.

## డీప్‌ఫేక్‌ను నియంత్రించేలా లోక్‌సభలో బిల్లు



ప్రస్తుత కృత్రిమమేధ యుగంలో చాలామంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. ఈ డీప్‌ఫేక్ నియంత్రణకు సంబంధించిన బిల్లు లోక్‌సభ ముందుకువచ్చింది. ఇలాంటి కంటెంట్ కట్టడికి అవసరమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేలా ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రతిపాదించారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే ఈ డీప్‌ఫేక్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇలాంటి కంటెంట్ రూపొందించేందుకు వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి చేయాలన్నారు. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం పెరిగిపోయింది. దీని నియంత్రణకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలి' అని శిందే అన్నారు. దురుద్దేశంతో ఇలాంటి కంటెంట్‌ను సృష్టించినా లేదా ఫార్వర్డ్ చేసినా అలాంటివారికి శిక్షలు పడాలన్నారు. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రతగురించి ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ టెక్నాలజీ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరినీ కలవరపెడుతోంది. ఈ డీప్‌ఫేక్‌ను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధాని మోదీ కూడా గతంలో దీనిపై ఆందోళన వ్యక్తంచేశారు. డీప్‌ఫేక్ వీడియోలు సమాజానికి పెనుముప్పుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

## 'ఇండియా' కూటమి
## వెంటిలేటర్‌పై ఉంది..!: ఒమర్ అబ్దుల్లా



బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌ను మళ్లీ ఎన్డీయే వైపు తామే నెట్టేసినట్లు అనిపిస్తోందని జమ్మూకశ్మీర్ సీఎం, ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఇండియా' కూటమి పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుందని వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల అనంతరం పరిస్థితి మరింత దిగజారిందన్నారు. ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో ఆయన ఈమేరకు మాట్లాడారు. ఎన్నికల్లో భాజపా పోరాడే తీరుపై ప్రశంసలు కురిపించారు. అయితే, తనకు ఆ పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేదని, భాజపా రాజకీయాలను వ్యతిరేకిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు 'ఇండియా' కూటమి కోసం గతంలో నీతీశ్ కుమార్ చేసిన ప్రయత్నాలను ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. తామే ఆయన్ను మళ్లీ ఎన్డీయేలోకి వెళ్లేలా చేసినట్లు భావిస్తున్నామన్నారు. ప్రతిపక్ష కూటమి కథ ముగిసిందనే వాదనలపై స్పందిస్తూ.. ప్రస్తుతం ఒకవిధంగా వెంటిలేటర్‌పై ఉందన్నారు. కోలుకుంటున్నామని భావించే సమయానికి.. బిహార్ వంటి ఫలితాలతో పరిస్థితి మళ్లీ దిగజారుతోందని చెప్పారు. బిహార్ విషయానికొస్తే జేఎంఎం పార్టీని 'ఇండియా' కూటమి, మహాగఠ్‌బంధన్‌లో చేర్చలేదనే విషయాన్ని గుర్తుచేశారు. తమను తాము ఒక కూటమిగా చెప్పుకొంటున్నామంటే.. మరింత సమగ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే ఘన విజయంపై స్పందిస్తూ.. "ఎన్నికలపైనే తమ జీవితాలు ఆధారపడి ఉన్నట్లు భాజపా పోరాడింది. మరోవైపు.. ఇండియా కూటమి పట్టింపు లేనట్లుగా వ్యవహరించింది. ఎన్డీయేతో పోలిస్తే 24x7 ఎన్నికలు, ప్రచారానికి మేం కట్టుబడి లేము" అని అన్నారు. ఎన్నికల ఫలితాల తారుమారు విషయంలో ఈవీఎంలపై అనుమానాలు లేనప్పటికీ.. ఓటరు జాబితాలను మార్చడం, నియోజకవర్గాల పునర్విభజన వంటి చర్యలతో ఇది సాధ్యమేనన్నారు. కేంద్రంతో సత్సంబంధాలు ఉన్నంత మాత్రాన తాను భాజపాతో పొత్తు పెట్టుకున్నట్లు అర్థం కాదన్నారు.

## భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదు: జైశంకర్



ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్ రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రష్యాతో బంధం కారణంగానే అమెరికా భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. దీనికి విదేశాంగ మంత్రి బదులిస్తూ.. 'వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్‌రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతోంది' అని అన్నారు. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు అని వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందన్నారు. భారత ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు.

### పాక్ ఆర్మీ నుంచే మనకు సమస్యలు

ఇక, ఈ కార్యక్రమంలో పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురయ్యింది. దీనికి జైశంకర్ బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో శాంతి కోసం భారత్ చైనా సంబంధాలు కీలకమన్నారు. ఇటీవల ఇరుదేశాల సంబంధాలు బలపడిన విషయాన్ని ప్రస్తావించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్వదేశంలో మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. హసీనా అప్పగింతపై ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో ఉండటం ఆమె వ్యక్తిగత విషయమన్నారు.

## అంత గౌరవం ఉంటే.. నెహ్రూ ఇంటి పేరును ఎందుకు పెట్టుకోలేదు: భాజపా విమర్శలు



దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను దూషించడమే కేంద్రంలోని అధికారపక్షం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆరోపించారు. నెహ్రూ ఘనతలను తుడిచేయడమే కాకుండా ఆయనకు సంబంధించిన సామాజిక, రాజకీయ పునాదులను నాశనం చేయాలని చూస్తోందన్నారు. అయితే ఆమె ఆరోపణలను భాజపా తిప్పికొట్టింది. అంత గౌరవమే ఉంటే.. నెహ్రూ ఇంటి పేరును ఆమె ఎందుకు పెట్టుకోలేదని ప్రశ్నించింది. "ఇలాంటి విమర్శలు ఆపాల్సిన సమయం వచ్చింది. ఆమెకు అంత గౌరవం ఉంటే.. తన పేరులో నెహ్రూ ఇంటి పేరును చేర్చుకునేవారు. ఆయన సేవలను తక్కువ చేసి చూసే వ్యక్తులు వారే. ఇందులో భాజపాకు కానీ, ప్రస్తుత ప్రభుత్వానికి కానీ ఎలాంటి ప్రమేయం లేదు" అని భాజపా అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ మీడియాతో మాట్లాడారు.

## భారత్‌కు.. త్వరలో 40వేల ఇజ్రాయెల్ 'లైట్ మెషిన్ గన్స్'!



వచ్చే ఏడాది ఆరంభంలో దాదాపు 40వేల లైట్ మెషిన్ గన్స్‌ను భారత్‌కు సరఫరా చేయనున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ పరికరాల సంస్థ ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. వీటితోపాటు దాదాపు 1.70లక్షల కార్బైన్‌లకు సంబంధించిన ఒప్పందం ఖరారు చివరి దశలో ఉందని తెలిపింది. పిస్టల్స్, రైఫిల్స్, మెషిన్ గన్స్ సహా ఇతర రక్షణ ఉత్పత్తులను మార్కెట్ చేసుకునేందుకు భారత హోంశాఖలోని వివిధ ఏజెన్సీలతో సంప్రదింపులు చేస్తున్నట్లు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐడబ్ల్యూఐ సీఈవో షుకి స్క్వాట్జ్ పేర్కొన్నారు. "గతేడాది చేసుకున్న ఒప్పందం ప్రకారం 40 వేల లైట్ మెషిన్ గన్స్‌ను తొలుత అందించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే పరీక్షలు, తనిఖీలు పూర్తికాగా.. ఉత్పత్తి కోసం లైసెన్స్ పొందాము. వచ్చే ఏడాది ప్రారంభంలో తొలి బ్యాచ్‌ను అందించాలని ప్రయత్నిస్తున్నాం. క్లోజ్ క్వార్టర్స్ బ్యాటిల్ (సీక్యూబీ) కార్బైన్స్ టెండర్‌లో భారత్ ఫోర్జ్ ప్రైమరీ బిడ్డర్ కాగా.. తమ సంస్థ రెండో బిడ్డర్. ఈ ఒప్పందంపై సంతకాలు చేసే దశలో ఉన్నాం. ఈ ఏడాది చివరి లేదా వచ్చే ఏడాది ప్రారంభం నాటికి ఖరారు అవుతుందని ఆశిస్తున్నాం" అని ఐడబ్ల్యూఐ సీఈవో వెల్లడించారు. కార్బైన్స్‌కు సంబంధించి 60శాతం ఆయుధాలను భారత్ ఫోర్జ్ నుంచి, మిగతా నలభై శాతం (1.70లక్షల ఆయుధాలను) అదానీ గ్రూపు అనుబంధ సంస్థ పీఎల్ఆర్ సిస్టమ్స్ సరఫరా చేయనుంది. ఇక ప్రపంచంలోనే తొలి కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ అర్బెల్ టెక్నాలజీని భారత్‌కు అందించేందుకు సంబంధిత ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నామని షుకి స్క్వాట్జ్ పేర్కొన్నారు. యుద్ధభూమిలో సైనికులు అత్యంత కచ్చితత్వంతో, చురుగ్గా వ్యవహరించేందుకు ఇదెంతో ఉపకరిస్తుందన్నారు. ఒప్పందం పూర్తికాగానే ఇజ్రాయెల్‌తోపాటు భారత్‌లోనూ వీటి తయారీ చేపడతామన్నారు.

### ఏమిటీ అర్బెల్ టెక్నాలజీ..?

అర్బెల్ టెక్నాలజీలో అధునాతన సెన్సర్లు ఉంటాయి. రియల్ టైమ్ బాలిస్టిక్ కంప్యూటేషన్, లక్ష్య సముపార్జన సామర్థ్యం ద్వారా సైనికులు లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించగలరు. దానిలో వాడే మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్ అల్గారిథం ద్వారా ఆయుధం సరిగా లక్ష్యాన్ని ఛేదించగలదా లేదా..? అని మిల్లీసెకన్లలో అంచనా వేస్తుంది. మొదటి షాట్ తర్వాత షూటర్ ట్రిగ్గర్‌పై వేలు అలాగే ఉంచితే.. షూటర్ ప్రవర్తనను విశ్లేషించి తదుపరి రౌండ్లను కూడా విడుదల చేస్తుంది.

## ఇజ్రాయెల్ 'దెయ్యాల'తో పోరాడుతోంది: సిరియా

గాజా యుద్ధం తర్వాత ఇజ్రాయెల్ 'దెయ్యాల'తో పోరాడుతోందని సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా ఎద్దేవా చేశారు. ఆ దేశం కొత్త శత్రువుల కోసం వెతుకుతోందని తెలిపారు. దోహా ఫోరంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. సిరియాలో ఏడాది క్రితం తాను అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రాంతీయ శాంతి, స్థిరత్వం విషయంలో సానుకూల సందేశాలు పంపుతున్నట్లు తెలిపారు. అయితే, ఇజ్రాయెల్ తన ప్రతిపాదనలను తిరస్కరించినట్లు చెప్పారు. హమాస్ ఉగ్రవాదులతో ఘర్షణను ఇజ్రాయెల్ ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తోందని, భద్రత పేరుతో తన దూకుడును సమర్థించుకుంటోందని అల్‌షరా విమర్శించారు.

## సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'కు షాక్..

**120 మిలియన్ యూరోల జరిమానా విధించిన ఈయూ..!**



**న్యూఢిల్లీ:** ప్రముఖ సోషల్ మీడియా 'ఎక్స్'కు యూరోపియన్ యూనియన్ షాక్ ఇచ్చింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'పై 120 మిలియన్ యూరోల జరిమానా విధించింది. డిజిటల్ సర్వీసెస్ చట్టం నియమాలను ఉల్లంఘించిందని విచారణలో తేలడంతో జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. 27 దేశాల యూరోపియన్ యూనియన్‌లో డిజిటల్ సర్వీసెస్ చట్టం కింద ఒక ప్లాట్‌ఫామ్‌పై నిబంధనలు పాటించడం లేదంటూ చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. డీఎస్ఏ సోషల్ మీడియా కంపెనీలను యూజర్ల సెక్యూరిటీని నిర్ధారించాలని.. తప్పుడు సమాచారం, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించాలని నిబంధనలు చెబుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే గణనీయమైన జరిమానాలు విధిస్తారు.

యూరోపియన్ యూనియన్ కమిషన్ ప్రకారం.. గతంలో ఎక్స్ బ్లూ టిక్‌ను రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, వెరిఫైడ్ అకౌంట్స్‌కు మాత్రమే ఇచ్చింది. కానీ, ప్రస్తుతం ఎనిమిది డాలర్లు చెల్లించి ఎవరైనా ఈ బ్యాడ్జ్‌ను ఇస్తుందని ఆరోపిస్తున్నది. ఈ వ్యవస్థ నిజమైన వినియోగదారులను ధ్రువీకరించడం లేదని.. ఫేక్ అకౌంట్స్‌ను గుర్తించడం కష్టతరం చేస్తుందని కమిషన్ తెలిపింది. డేటాబేస్ తగినంత సమాచారాన్ని అందించడం లేదని ఈయూ వాదిస్తున్నది. అనేక సాంకేతిక అడ్డంకులు పరిశోధకులు డేటాను యాక్సెస్ చేయకుండా చేస్తున్నాయని.. నకిలీ ప్రకటనలు, తప్పుడు సమాచార ప్రచారాలను గుర్తించడం కష్టతరం చేస్తుందని ఈయూ చెబుతున్నది. దాంతో డేటాను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషన్ పేర్కొంది. ఈయూ వైస్ ప్రెసిడెంట్ హెన్నా విర్కునెన్ మాట్లాడుతూ.. బ్లూ టిక్‌లతో వినియోగదారులను తప్పుదారి పట్టించడం, ప్రకటన సమాచారాన్ని దాచడం, రీసెర్చర్స్‌ను అడ్డుకోవడం యూనియన్‌లో ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.

## ప్రయాణికులకు సారీ చెప్పిన ఇండిగో... రిఫండ్లపై క్లారిటీ

**ప్రయాణికులకు క్షమాపణలు చెప్పిన ఇండిగో సంస్థ**

**రిఫండ్ల ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడి**

**ఆదివారం రాత్రి 8 గంటలలోపు రిఫండ్లు పూర్తి చేయాలని కేంద్రం ఆదేశం**

**రద్దీని తట్టుకునేందుకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసిన రైల్వే శాఖ**

**విమానాల రద్దుతో ఐదో రోజుకు చేరిన ఇండిగో సంక్షోభం**




**ముంబై:** దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోలో తలెత్తిన తీవ్ర సంక్షోభం ఐదో రోజుకు చేరింది. పైలట్ల కొరత, ప్రణాళికా లోపాల కారణంగా వందలాది విమానాలు వరుసగా రద్దు కావడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించిన ఇండిగో, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి హృదయపూర్వకంగా క్షమాపణలు చెప్పింది. కస్టమర్లకు చెల్లించాల్సిన రిఫండ్ల ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శనివారం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది.

కార్యకలాపాలను తిరిగి గాడిన పెట్టేందుకు తమ బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయని ఇండిగో తెలిపింది. "విమానాల షెడ్యూళ్లను స్థిరీకరించడం, ఆలస్యాన్ని తగ్గించడం, ప్రయాణికులకు పూర్తిస్థాయిలో మద్దతుగా నిలవడంపై ప్రధానంగా దృష్టి సారించాం. నిన్నటితో పోలిస్తే శనివారం రద్దయిన విమానాల సంఖ్యను 850కి తగ్గించగలిగాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్యను మరింత తగ్గిస్తాం" అని భరోసా ఇచ్చింది. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని టెర్మినల్స్, వెబ్‌సైట్, నోటిఫికేషన్ల ద్వారా అందిస్తున్నామని, ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించింది. రిఫండ్లకు సంబంధించిన సహాయం కోసం కస్టమర్ సపోర్ట్‌ను సంప్రదించాలని కోరింది.

మరోవైపు, ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇండిగో యాజమాన్యానికి పలు కఠిన ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న రిఫండ్ల మొత్తాన్ని ఆదివారం రాత్రి 8 గంటల లోపు క్లియర్ చేయాలని అల్టిమేటం విధించింది. అంతేకాకుండా, ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి, వారి నివాసానికి లేదా వారు కోరిన చిరునామాకు చేర్చాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ గడువులోగా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న ప్రయాణికులకు ఉపశమనం కల్పించేందుకు భారతీయ రైల్వే శాఖ ముందుకు వచ్చింది. ఆకస్మిక రద్దీని తట్టుకునేందుకు దేశవ్యాప్తంగా 37 ప్రీమియం రైళ్లకు అదనంగా 116 కోచ్‌లను జత చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మొత్తం 114 అదనపు ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇండిగో విమానాలు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్న వేలాది మంది ప్రయాణికులకు ఊరట లభించనుంది. మొత్తంగా ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అటు సంస్థ, ఇటు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## తగ్గిన ద్రవ్యోల్బణం..

**స్టాక్స్, బాండ్లకు లాభం, బంగారానికి నష్టమా?**

**భారత్‌లో ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం**

**ప్రభుత్వ బడ్జెట్ లోటు తగ్గడమే ప్రధాన కారణమని విశ్లేషణ**

**తక్కువ ద్రవ్యోల్బణం స్టాక్స్, బాండ్లకు సానుకూలం**

**ద్రవ్యోల్బణం ఇలాగే కొనసాగితే బంగారం ధరలకు రిస్క్**

**అమెరికాలో టారిఫ్‌లు పెరిగినా ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంపై ఆసక్తి**




**న్యూఢిల్లీ:** భారత్‌లో ద్రవ్యోల్బణం గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి దిగివచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 2 శాతం స్థాయికి చేరుకుంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. ఇది ఇటీవలి సంవత్సరాల సగటు 6 శాతం కంటే చాలా తక్కువ. అమెరికాలోనూ 2021లో 7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, టారిఫ్‌లు పెంచినప్పటికీ ఈ ఏడాది 3 శాతానికి తగ్గింది. ఈ తగ్గుదలకు అసలు కారణం ప్రభుత్వాల బడ్జెట్ లోటును నియంత్రించడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ద్రవ్యోల్బణానికి ఒకే ఒక్క ప్రధాన కారణం ఉంటుంది. మార్కెట్‌లో వస్తువుల ఉత్పత్తికి మించి ద్రవ్య సరఫరా (మనీ సప్లై) పెరగడమే అది. ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును భర్తీ చేయడానికి బాండ్లను జారీ చేస్తాయి. సెంట్రల్ బ్యాంకులు వాటిని కొనుగోలు చేసినప్పుడు కొత్త ద్రవ్యం మార్కెట్లోకి వస్తుంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

# శతక్కొట్టిన జైస్వాల్..

**సఫారీలను చిత్తుగా ఓడించి సిరీస్ పట్టేసిన టీమిండియా..!**




**విశాకపట్నం:** టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. వైజాగ్ గడ్డపై ఓపెనర్ యశస్వీ జైస్వాల్(116 నాటౌట్) అజేయ శతకంతో కదంతొక్కగా.. రోహిత్ శర్మ(75), విరాట్ కోహ్లీ(65 నాటౌట్) మరో క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ప్రత్యర్థి నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో టాపార్డర్ దంచేయడంతో టీమిండియా 9 వికెట్లతో సఫారీలను మట్టికరిపించింది.

ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమిండియా స్వదేశంలో తొలి వన్డే సిరీస్ పట్టేసింది. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే వైజాగ్ వన్డేలో అత్యుత్తమ ఆటతో సఫారీలకు చెక్ పెట్టింది రాహుల్ సేన. ఈ ఫార్మాట్లో శతకంతో మెరిసిన యశస్వీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికవ్వగా.. రెండు సెంచరీలు, ఒక ఫిఫ్టీ బాదిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత తొలిసారి టాస్ గెలిచిన భారత్.. బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని 270కే కట్టడి చేసింది. అనంతరం ఛేదనలో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(116 నాటౌట్), రోహిత్ శర్మ(75) పవర్ ప్లేలో వికెట్ పడకుండా ఆడారు. యశస్వీ కాస్త ఆచితూచి ఆడగా.. రోహిత్ తనదైన పుల్‌షాట్లతో రెచ్చిపోయాడు. ఈ ద్వయం.. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు దిశగా నడిపింది. అయితే.. 61వ హాఫ్ సెంచరీ తర్వాత శతకానికి చేరువైన హిట్‌మ్యాన్‌ను మహరాజ్ వెనక్కి పంపాడు. దాంతో.. తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ 155 పరుగులకు తెరపడింది.

### కోహ్లీ విధ్వంసం..

పవర్ ప్లే తర్వాత దంచేసిన రోహిత్ ఔటయ్యేసరికి భారత్ స్కోర్.. 155. అప్పటికి మ్యాచ్ టీమిండియా చేతుల్లోనే ఉంది. అనంతరం క్రీజులోకి వచ్చిన శతకాల వీరుడు విరాట్ కోహ్లీ(65 నాటౌట్) తనదైన స్టయిల్లో చెలరేగాడు. యాన్సెన్ ఓవర్లో బౌండరీతో తన విధ్వంసానికి తెరతీసిన విరాట్.. బాష్‌కు చుక్కలు చూపిస్తూ 34 ఓవర్లో 4, 6 బాదాడు. కాసేపటికే సింగిల్‌తో యశస్వీ వన్డేల్లో తొలి సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత గేర్ మార్చిన కోహ్లీ ఫోర్లతో హోరెత్తించాడు. పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బార్ట్‌మన్‌ను టార్గెట్ చేసిన రన్ మెషీన్ అతడి ఓవర్లో బౌండరీతో 76వ అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు.. ఎంగిడి వేసిన 40 వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు. విరాట్, యశస్వీ అజేయంగా నిలవగా 9 వికెట్లతో సఫారీలను ఓడించిన టీమిండియా.. 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

### ప్రసిధ్, కుల్దీప్ షో

రాయ్‌పూర్ వన్డేలో తేలిపోయిన భారత బౌలర్లు వైజాగ్‌లో చెలరేగారు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా హిట్టర్ల జోరుకు కళ్లెం వేశారు. ప్రసిధ్ కృష్ణ(4-66) టాపార్డర్‌ను దెబ్బకొట్టగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4-41) మిడిలార్డర్‌ను పడగొట్టి సఫారీలకు షాకిచ్చాడు. ఒకే ఓవర్లో డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(29), మార్కో యాన్సెన్(17)లను ఔట్ చేసి భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు కుల్దీప్. ఓపెనర్ క్వింటన్ డికాక్(106) సెంచరీతో కదంతొక్కగా.. కెప్టెన్ తెంబా బవుమా(48) రాణించగా ప్రొటీస్ టీమ్ 270కి ఆలౌటయ్యింది.

## జస్టిన్ గ్రీవ్స్ డబుల్ సెంచరీ..

**ఓటమి నుంచి తప్పించుకున్న వెస్టిండీస్**

**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్, వెస్టిండీస్ మధ్య జరిగిన తొలి టెస్టు డ్రా అయ్యింది. విండీస్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ జస్టిన్ గ్రీవ్స్ డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నారు. క్రైస్ట్‌చర్చ్ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 531 రన్స్ టార్గెట్‌తో విండీస్ సమయంలో.. గ్రీవ్స్‌కు రోచ్ అండగా నిలిచారు. ఆ ఇద్దరూ ఏడో వికెట్‌కు అజేయంగా 180 రన్స్ జోడించారు. చివరి రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 457 రన్స్ చేసింది.

జస్టిన్ గ్రీవ్స్ అసాధారణ రీతిలో బ్యాటింగ్



బ్యాటింగ్ ప్రారంభించింది. ఓ దశలో 72 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇక తొలి టెస్టులో ఓటమి తప్పదు అనుకున్న సమయంలో.. షాయ్ హోప్, జస్టిన్ గ్రీవ్స్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్‌కు 196 రన్స్ జోడించారు. ఆ తర్వాత హోప్ 140 రన్స్ చేసి ఔటయ్యాడు. ఇక విండీస్ ఓడిపోవడం మళ్లీ ఖాయం అనుకున్న చేశాడు. 388 బంతుల్లో గ్రీవ్స్ 202 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు ఉన్నాయి. టెస్టులోని నాలుగవ ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసిన 4వ విండీస్ బ్యాటర్‌గా గ్రీవ్స్ రికార్డు క్రియేట్‌చేశాడు. ఇక కీమర్ రోచ్ కూడా క్రీజ్‌కు అతుక్కుపోయాడు. 233 బంతుల్లో అతను 58 రన్స్ చేశాడు. దాంట్లో 8 ఫోర్లు ఉన్నాయి.

## కోహ్లీ మరో ఘనత..

**'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డుల్లో నంబర్ 2 ..!**



**విశాఖపట్నం:** వన్డే ఫార్మాట్లో రెచ్చిపోయి ఆడుతున్న విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికాపై రెండు వన్డేల్లో శతకాలతో చెలరేగిన విరాట్.. వైజాగ్‌లో అర్ధ శతకంతో మెరిసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డుకు ఎంపికకయ్యాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో విరాట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలవడం ఇది పన్నెండోసారి. దాంతో.. వన్డేల్లో అత్యధిక పర్యాయాలు ఈ అవార్డు గెలుచుకున్న రెండో క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు విరాట్. 11 పర్యాయాలు ఈ అవార్డు అందుకున్న శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్యను కోహ్లీ అధిగమించాడు.

ఫార్మాట్ ఏదైనా సరే క్రీజులో ఉంటే పరుగుల వరదే అన్నట్టుగా ఆడే విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. తనకు ఎంతో అచ్చొచ్చిన ఈ ఫార్మాట్‌లో రికార్డు సెంచరీలు బాదిన కోహ్లీ.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ విజయాలతోనూ రికార్డు నెలకొల్పాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో 302 రన్స్‌తో 12వసారి ఈ అవార్డు పట్టేశాడీ మాజీ కెప్టెన్. అయితే.. వన్డేల్లో అత్యధిక పర్యాయాలు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌లు గెలుపొందిన రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది.

క్రికెట్ గాడ్‌గా కోట్లాది మంది గుండెల్లో కొలువైన సచిన్ తన కెరీర్లో 15 సార్లు ఈ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న కోహ్లీ.. మరో నాలుగైదు సిరీస్‌లు ఆడితే మాస్టర్ బ్లాస్టర్ రికార్డు బ్రేక్ చేయడం ఖాయం. ఇప్పటికే వన్డే సెంచరీల్లో సచిన్‌ను దాటేసిన కోహ్లీ.. రాంచీలో 52వ వన్డే శతకంతో అంతర్జాతీయ క్రికెట్ ఒక ఫార్మాట్లలో అత్యధిక సెంచరీల వీరుడిగా అవతరించాడు. అయితే.. ఇప్పటికైతే వచ్చే వరల్డ్ కప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు విరాట్. మూడు ఫార్మాట్లలో కలిపితే విరాట్ 22వసారి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గౌరవాన్ని స్వీకరించాడు.

# ఆ బ్యాటర్‌ను జట్టులో కొనసాగించాలి

**రవిచంద్రన్ అశ్విన్**






**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలకు గురవడంతో రుతురాజ్ గైక్వాడ్‌కు అనూహ్యంగా తుదిజట్టులో చోటు దక్కింది. అయితే అతడు రాంచీ వన్డేలో విఫలమయ్యాడు. 14 బంతులు ఎదుర్కొని కేవలం 8 పరుగులు మాత్రమే చేశాడు. కానీ అతడు క్రీజులో ఉన్నంతవరకు సౌకర్యవంతంగానే కనిపించాడు. దురదృష్టవశాత్తూ డెవాల్డ్ బ్రెవిస్ అద్భుతమైన క్యాచ్ పట్టడం వల్ల పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. రాయ్‌పుర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో మాత్రం రుతురాజ్ తన సత్తా చాటాడు. సెంచరీతో (105బీ 83 బంతుల్లో, 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగిపోయాడు. అలాగే అతడి షాట్ సెలక్షన్, వికెట్ల మధ్య పరుగు, విరాట్‌కోహ్లీతో భాగస్వామ్యం విషయంలో చక్కటి సమన్వయం, పరిణితి ప్రదర్శించాడు. అందుకే శ్రేయస్ అయ్యర్ గాయం నుంచి కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చినా.. రుతురాజ్ గైక్వాడ్‌కు జట్టులో చోటు కల్పించాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ సూచించాడు.

'కొంతమంది క్రికెటర్లకు చాలా అదృష్టం ఉంటుంది. వారికి వెంటనే గుర్తింపు దక్కుతుంది. జట్టులోనూ ఎక్కువ కాలం కొనసాగుతారు. కానీ రుతురాజ్ మాత్రం.. చక్కటి ప్రదర్శనలు చేసినా అతడు దీర్ఘకాలం జట్టులో కొనసాగలేకపోతున్నాడు. దురదృష్టవశాత్తూ కొన్నిసార్లు గాయాల వల్ల కూడా రుతురాజ్ టీమ్‌లో స్థానం కోల్పోతున్నాడు' అని రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు.

'రుతురాజ్ గైక్వాడ్ నాలుగో స్థానంలో సరిగ్గా సరిపోతాడు. అతడు సీమర్లను చక్కగా ఆడగలడు. ఒకవేళ బాల్ స్వింగ్ అయితే తప్ప వారు రుతురాజ్‌ను ఔట్ చేయలేరు. ఇక స్పిన్ విషయానికొస్తే.. ప్రస్తుతం టీమ్ఇండియాలో అతడికంటే ఇంకెవరూ అంత బాగా ఆడలేరు. అలాగే వికెట్ల మధ్య పరుగులు చాలా వేగంగా తీయగలడు. అతడి అమ్ములపొదిలో అన్ని క్రికెటింగ్ షాట్లూ ఉన్నాయి. నాలుగో స్థానం కోసం ఒక బ్యాటర్ ఇంతకంటే తనను తాను నిరూపించుకోవడానికి ఇంకేమీ లేదు' అని అశ్విన్.. రుతురాజ్ గైక్వాడ్‌కు మద్దతుగా నిలిచాడు.

'గాయం నుంచి కోలుకుని శ్రేయస్ అయ్యర్ జట్టులోకి వచ్చినా.. రుతురాజ్ గైక్వాడ్‌ను కొనసాగించాలి. నైపుణ్యమున్న అతడిని జట్టులో దీర్ఘకాలం కొనసాగించాలి. అలాగే రుతురాజ్.. విరాట్ కోహ్లీతో కలిసి రాయ్‌పుర్ వన్డేలో 195 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పాడు. వారిద్దరి కాంబినేషన్ కూడా చక్కగా కుదిరింది. వీరిద్దరూ స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారు' అని అశ్విన్ విశ్లేషించాడు.

MOVIE TIME



# మరోసారి పెళ్లి వార్తలు..

## క్లారిటీ ఇచ్చిన మీనాక్షి చౌదరి



టాకీస్: టాలీవుడ్ యువ కథానాయిక మీనాక్షి చౌదరి, అక్కినేని హీరో సుశాంత్‌లు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు మళ్లీ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై మరోసారి స్పందించింది మీనాక్షి బృందం. గత కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారంటూ వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదని టీమ్ తెలిపింది. మీనాక్షి చౌదరి, సుశాంత్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలోని కొన్ని మీమ్ పేజీలు, వెబ్‌సైట్లు రెండు రోజులుగా మళ్లీ వార్తలను వైరల్ చేస్తున్నాయి. వచ్చే ఏడాది వీరి పెళ్లి అంటూ ఫొటోలు సైతం షేర్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఖండించిన మీనాక్షి, తాజాగా ఈ రూమర్స్‌పై తన టీమ్ ద్వారా మరోసారి వివరణ ఇప్పించారు. కాగా, వీరిద్దరూ కలిసి 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంలో నటించారు. ఆ సినిమా నుంచే వీరి మధ్య మంచి స్నేహం ఏర్పడినట్లు సమాచారం.

# ఆంధ్ర కింగ్ తాలుకా కలెక్షన్స్ జోరు

టాకీస్: బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్ లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు.ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్ లో షేర్ ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్‌ని అందుకుంటుందో చూడాలి.

# 'వా వాతియర్' ట్రైలర్ విడుదల



టాకీస్: స్టార్ నటుడు కార్తి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం వా వాతియార్. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జిఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కెఇ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమాలో కార్తి పోలీస్ పాత్రలో నటించబోతున్నాడు. అయితే ఈ చిత్రం తెలుగులో అన్నగారు వస్తారు అనే పేరుతో విడుదల కాబోతుండగా.. తెలుగులో ఈ సినిమా ట్రైలర్‌ను సాయంత్రం 5 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత..



టాకీస్: ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం.

# ఓటీటీలోకి ధూల్ పేట్ పోలీస్ స్టేషన్

టాకీస్: డిజిటల్ రంగంలో 100 శాతం వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా . ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్ని సూపర్‌హిట్ సినిమాలు, థ్రిల్లింగ్ సస్పెన్స్ వెబ్ సిరీస్?లను సినీ ప్రియులకు అందించింది. అలాగే అన్‌స్టాపబుల్ అంటూ టాక్‌షోలు, తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్ సింగింగ్ షోలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అదిరిపోయే వెబ్ సిరీస్ లను అందించింది ఆహా. ఇక ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఆహాలో ఇప్పటికే ఎన్నో రకాల వెబ్ సిరీస్ టాప్ లో దూసుకుపోతున్నాయి. తాజాగా ఓ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ అందుబాటులోకి వచ్చింది.ఆ సిరీస్ మరేదో కాదు ధూల్ పేట్ పోలీస్ స్టేషన్. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ సిరీస్ పై అభిమానుల్లో ఆసక్తి పెంచేశాయి. నేటి నుంచి ఈ సిరీస్ ప్రేక్షకులకు ఆహాలో అందుబాటులోకి వచ్చింది. ఇంట్రెస్టింగ్ స్టోరీతో ఈ సిరీస్ తెరకెక్కిందని అంటున్నారు.తమిళ యాక్టర్స్ అశ్విన్, శ్రీతు కృష్ణన్, గురు ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రల్లో



నటించారు. ఈ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ కు జస్విని దర్శకత్వం వహించారు. ఆసక్తికరమైన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిరీస్.. ఈ శుక్రవారం( నేటి నుంచి) తెలుగు, తమిళంలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అలానే ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో నేడు ( శుక్రవారం) ఓ ఎపిసోడ్ ను రిలీజ్ చేశారు. ఇక ధూల్ పేట్ అనే ఊరిలో ఓ రోజు రాత్రి మూడు హత్యలు జరుగుతాయి. వీటిని దర్యాప్తు చేసేందుకు ఓ ఏసీపీని అపాయింట్ చేస్తారు. అతను నేరస్థులను పట్టుకోలేకపోతాడు. దీంతో మరో ఏసీపీని కూడా కేసుని దర్యాప్తు చేసేందుకు నియమిస్తారు. తర్వాత ఏమైంది? అసలు ఆ హత్యలు చేసింది ఎవరు.? ఎందుకు అనేది సిరీస్ లో చూడాల్సిందే..

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.